పరువు పరుగు..

వెబ్ సిరీస్ : పరువు
నటీనటులు : నివేదా పేతురాజ్, నరేశ్ అగస్త్య, నాగబాబు, బిందు మాధవి
దర్శకత్వం : సిద్ధార్థ్ నాయుడు
సంగీతం : శ్రవణ్ భరద్వాజ్
నిర్మాతలు : కొణిదల సుస్మిత, లగ్గిశెట్టి విష్ణు ప్రసాద్
ఓటీటీ : జీ5

ప్రతివారం ఎన్నో సినిమాలు, సిరీస్‌లు.. ఓటీటీల్లో విడుదల అవుతుంటాయి. వాటిలో కొన్ని మాత్రమే ప్రేక్షకులను అలరిస్తాయి. లవ్, కామెడీ, రొమాంటిక్ ఎంటర్‌టైనర్లతో పోలిస్తే క్రైమ్, థ్రిల్లింగ్ కథలతో తెరకెక్కేవే.. ప్రస్తుతం హిట్ టాక్ సొంతం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో పరువు హత్యల నేపథ్యం ఉన్న కథతో తెరకెక్కిందే ఈ 'పరువు' వెబ్ సిరీస్. పోయిన వారం జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చి.. టాప్ 10లో నిలిచింది.

కథ : పెద్దలను ఎదిరించి సుధీర్ (నరేష్ అగస్త్య)ను పెళ్లి చేసుకుంటుంది పల్లవి (నివేదా పేతురాజ్). వేరే కులం వ్యక్తిని పెళ్లి చేసుకున్నదనే కారణంతో పల్లవిని తల్లిదండ్రులు, బంధువులు కూడా దూరంగా ఉంచుతారు. అయితే, పెద్దనాన్న మరణించారనే వార్త తెలిసిన పల్లవి.. భర్తతో కలిసి సొంతూరికి బయల్దేరుతుంది. కొన్ని కారణాలతో.. ఇష్టం లేకున్నా వారిని తన కారులో తీసుకెళ్లడానికి అంగీకరిస్తాడు పల్లవి బావ చందు (సునీల్ కొమ్మిశెట్టి). ప్రయాణ సమయంలో తన భర్తను చులకన చేస్తూ మాట్లాడిన చందుతో గొడవపడుతుంది పల్లవి. ఈ క్రమంలో చందు దగ్గర తుపాకీ ఉన్నట్టు తెలుస్తుంది. తన భర్తను చంపేందుకే తుపాకీ తెచ్చాడని అనుమానిస్తుంది పల్లవి. అదేం కాదని సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తాడు చందు. అయినప్పటికీ.. వారిద్దరి మధ్య వాగ్వాదం పెరిగిపోతుంది. ఈ క్రమంలో సుధీర్ రాడ్డుతో కొట్టడంతో చందు చనిపోతాడు. శవాన్ని ఎవరికీ కనిపించకుండా చేయాలని నిర్ణయించుకుంటారు భార్యాభర్తలిద్దరూ. ఇక, చందు కనిపించడం లేదని అప్పటికే తనతో నిశ్చితార్థం అయిన స్వాతి (ప్రణీత పట్నాయక్) ఎంక్వయిరీ చేస్తుంది. ఎమ్మెల్యే రామయ్య (నాగబాబు) చందూను కిడ్నాప్ చేయించి ఉంటాడని ఆరోపిస్తుంది. అసలు రామయ్యకు చందూకి ఉన్న సంబంధం ఏంటి? చందు శవాన్ని పల్లవి, సుధీర్ ఏం చేశారు? చందు దగ్గర తుపాకీ ఎందుకు ఉంది? అనేది సిరీస్ చూసి తెలుసుకోవాలి.

ఎలా ఉంది : పరువు హత్యల నేపథ్యంలో తెరకెక్కిన సిరీస్ అని టైటిల్ చూస్తేనే అర్థమవుతుంది. అయితే, చందు శవాన్ని ఏం చేశారు? అనే దానిపై కథను నడిపించాడు దర్శకుడు.

గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న సన్నివేశాలను ఎక్కువగా అటూఇటూ చూపించడంతో సగటు ప్రేక్షకుడిలో కాస్త తికమక ఏర్పడుతుంది. అదే సమయంలో కొన్ని ఎపిసోడ్స్ వేగంగా సాగుతాయి. దీంతో సిరీస్ చూస్తున్నంత సేపూ బోర్ కొట్టదు. క్లయిమాక్స్ కూడా డిఫరెంట్‌గా అనిపిస్తుంది. చాలా వెబ్ సిరీస్‌లలో ఉండే అభ్యంతరకర సన్నివేశాలు.. ఈ సిరీస్‌లో మచ్చుకు కూడా కనిపించవు. అయితే, సంభాషణల్లో మాత్రం ప్రతి క్యారెక్టర్ అసభ్య పదజాలాన్ని ఉపయోగించారు.

మనసు తీసుకో.. నిద్ర ఇచ్చెయ్!

అందంతోపాటు అభినయం ఆమె సొంతం. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పటి నుంచీ వరుసగా సినిమాలు చేస్తూ.. స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. దాదాపు అగ్ర హీరోలందరి సరసన నటించి.. బాలీవుడ్ టాప్ హీరోయిన్‌లలో ఒకరిగా ఉన్నారు శ్రద్ధా కపూర్. బీటౌన్‌లో హీరోయిన్లపై రూమర్లు సాధారణమే. అయితే, 37 ఏళ్ల ఈ భామ.. 34 ఏళ్ల వ్యక్తితో డేటింగ్ చేస్తున్నట్టు వస్తున్న వార్తలు మాత్రం అభిమానులకు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

రణ్‌బీర్ కపూర్ హీరోగా నటించిన 'తు ఝూఠీ మే మక్కార్' సినిమాకు రచయితగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు రాహుల్ మోడీ. ఆ సినిమాలో ఫిమేల్ లీడ్ రోల్ చేశారు శ్రద్ధ. ఈ సినిమా తర్వాత నుంచి శ్రద్ధ, మోడీ డేటింగ్‌లో ఉన్నారన్న వార్తలు బీటౌన్‌లో చక్కర్లు కొడుతున్నాయి. వాళ్లిద్దరూ కలిసి ఉన్న ఫొటోలు కూడా సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో వాటిపై ఒక్క పోస్ట్‌తో క్లారిటీ ఇచ్చేశారు శ్రద్ధ. రాహుల్‌తో దిగిన ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేశారు శ్రద్ధా కపూర్. ఆ ఫొటోలో అతని చెయ్యి పట్టుకుని నవ్వుతూ కనిపించారు కూడా! అంతేకాదు, ఆ ఫొటోకు 'నా మనసును తీసుకుని వెళ్లు. కానీ, నా నిద్రను మాత్రం నాకు తిరిగి ఇచ్చెయ్' అనే కాప్షన్ పెట్టారు. హార్ట్ సింబల్‌తో పాటు నవ్వుతున్న ఎమోజీలనూ జతచేశారు. ఈ ఒక్క పోస్ట్‌తో.. తాను రాహుల్‌తో డేటింగ్‌లో ఉన్నట్టు శ్రద్ధ క్లారిటీ ఇచ్చేసిందని అంటున్నారు నెటిజన్లు. జామ్‌నగర్‌లో అత్యంత వైభవంగా జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుకల్లో కూడా శ్రద్ధ, రాహుల్ జంటగా కనిపించడం విశేషం.

అసభ్యంగా తాకేవారు..

ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చేవారేకాదు.. స్టార్‌స్టేటస్ తెచ్చుకున్న చాలామంది హీరోయిన్లు ఎప్పుడో ఒకప్పుడు క్యాస్టింగ్ కౌచ్‌ను ఎదుర్కొన్నవారే! ఆ బాధితుల జాబితాలో తాను కూడా ఉన్నానని చెబుతున్నది ముంబై భామ ఇషా కొప్పికర్. నాగార్జున సరసన చంద్రలేఖ సినిమాతో తెలుగులో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఇషా.. బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. తాజాగా.. శివ కార్తికేయన్ హీరోగా చేసిన 'అయలాన్' సినిమాలో కనిపించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో 'క్యాస్టింగ్ కౌచ్'పై సంచలన కామెంట్లు చేశారు. 'ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కొత్తలో ఒక స్టార్ నటుడు నన్ను ఒంటరిగా కలవమని అడిగారు. డ్రైవర్ కూడా లేకుండా రావాలని చెప్పారు. అప్పటికే తనపై చాలా రూమర్స్ ఉన్నాయని, ఎవరికైనా తెలిస్తే ఇబ్బంది అవుతుందని కూడా అన్నారు. ఆ సమయంలో ఆయన బాలీవుడ్‌లో స్టార్ హీరో. అయినా.. ఆయన్ను కలవడానికి ఆసక్తిగా లేనని చెప్పేశాను. అంతేకాదు, సినిమాల్లో అవకాశాలు రావాలంటే హీరోలతో స్నేహంగా ఉండాలని కొంతమంది సలహాలు కూడా ఇచ్చేవారు. షూటింగ్ సమయంలోనూ కొందరు నటులు అసభ్యకరంగా తాకేవారు' అని చెప్పుకొచ్చారు ఇషా. కాగా, ఈ సీనియర్ హీరోయిన్ తెలుగులో ప్రేమతో రా, కేశవ సినిమాలలో కూడా నటించారు.

ఆ విషయంలో నేను అన్‌లక్కీ

ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి.. సొంత టాలెంట్‌తో ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు నటుడు కార్తీక్ ఆర్యన్. ఒకపక్క మంచి సినిమాలు చేస్తూనే.. పెద్ద సినిమాలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నాడు. కార్తీక్ ఆర్యన్ నటించిన తాజా చిత్రం 'చందు ఛాంపియన్'. కబీర్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పోర్ట్స్ డ్రామాలో శ్రద్ధా కపూర్ హీరోయిన్‌గా నటించారు. జూన్ 14న విడుదలైన 'చందు ఛాంపియన్' ప్రేక్షకులను అలరిస్తున్నది. కాగా, ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా కార్తీక్ చేసిన కామెంట్లు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అవేంటో ఆయన మాటల్లోనే..

'నేను ఎవరితోనో డేటింగ్‌లో ఉన్నాననే చర్చ.. ఈ మధ్య సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. ఆ చర్చ ఇంకా కొనసాగుతూనే ఉన్నది. నిజం చెప్పాలంటే.. నేను ఎవరితోనూ డేటింగ్‌లో లేను. సెలెబ్రిటీ హోదా వచ్చిన తర్వాత.. బయట కూడా భయంభయంగానే తిరుగుతున్నా. మిత్రులను కూడా తక్కువగా కలుస్తున్నా. చాలామంది నన్ను రొమాంటిక్ హీరో అని పిలుస్తుంటారు. కానీ ప్రేమ విషయంలో మాత్రం నేను ఎప్పుడూ దురదృష్టవంతుణ్నే. డబ్బు, పాపులారిటీ వచ్చిన తర్వాత నచ్చిన వస్తువులను కొనుక్కోగలం. కానీ, ప్రేమను మాత్రం కొనలేం. అందుకే నా జీవితానికి సరిపడే సరైన వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నాను' అని చెప్పుకొచ్చాడు కార్తీక్ ఆర్యన్.

కలి కథ.. సైన్స్ భరితమా! పురాణ చరితమా?

కిరీటాల్లేవ్.. ధనుర్బాణాలు అస్సల్లేవ్.. రథాల అలికిడి లేదు.. గుర్రాల సకిలింపులూ లేవు. అసుర రాజు ఆగ్నేయాస్త్రం సంధించడాలు కనిపించవు. దానికి విరుగుడుగా అవతారపురుషుడు వారుణాస్త్రం ఎక్కుపెట్టడం అస్సలు ఉండదు. అంతా మాయ! ఏదో మిథ్య!! సైన్స్ అండ్ ఫిక్షన్‌గా రూపాంతరం చెందిన ఫక్తు పౌరాణిక చిత్రం.. ఈ వారమే వెండితెరపై జైత్రయాత్ర చేయనుంది. అదే 'కల్కి 2898 ఏడీ'! ద్వాపర యుగాంతం నుంచి కలియుగాంతం వరకు నడిచిన కథ! ఆరువేల సంవత్సరాల సుదీర్ఘ కాలయానాన్ని.. మూడు గంటల నిడివిలో నిక్షిప్తం చేసి.. సెల్యులాయిడ్ స్క్రీన్‌పై పెనుబాంబులా విసురుతున్నాడు దర్శకుడు నాగ్ అశ్విన్. ఇంతకీ ఇది ఏ తరహా చిత్రం.. తెలుగు తెరపై కాంతులు విరజిమ్మిన పౌరాణిక చిత్రాల సరసన నిలవనుందా! హాలీవుడ్‌కు సవాలుగా నిలిచే సైన్స్ వండర్‌గా వెలిగిపోనుందా?

తెలుగు ఇండస్ట్రీలోకి ఎన్వీయార్ వచ్చాడు.. హిరణ్యకశిపుడి పాత్ర రొమ్ము విరిచింది. ఎన్టీయార్ వచ్చాడు రాముడు, కృష్ణుడు పాత్రలు మురిసిపోయాయి, సుయోధనుడి పాత్ర మరింత విర్రవీగింది. అక్కినేనిని చూసి అర్జునుడి వేషం కొత్తరూపు సంతరించుకుంది. అభిమన్యుడి పాత్ర మరింత ముద్దుగా కనిపించింది. సీఏస్సార్ వాక్చాతుర్యానికి శకుని పాచికలు మరింత చక్కగా పొరాయి. ఇలా చెబుతూ వెళ్తే.. తెలుగు సినిమాను పురాణ భరితం చేసిన దర్శక, నిర్మాతలు, నటీనటులు ఎందరెందరో! పౌరాణిక చిత్రాలు టాలీవుడ్ పేటెంట్ రైట్. తెలుగు వెండితెరపై తొట్టతొలుత ఆడిన చిత్రం పౌరాణికమే! ఆనాటి నుంచి రెండు మూడు దశాబ్దాలపాటు ఎన్నెన్నో పౌరాణిక చిత్రాలు వచ్చి బహుళ ప్రజాదరణ పొందాయి. రామాయణం, మహాభారతం, అష్టాదశ పురాణాలు, భాగవతం అన్నీ తెలుగు సినిమాలై ప్రేక్షకులకు పురాణ వైభవాన్ని కండ్లకుకట్టాయి. 'బాలభారతం', 'శ్రీకృష్ణపాండవీయం', 'పాండవ వనవాసం', 'నర్తనశాల', 'దానవీరశూరకర్ణ' ఈ ఐదు చిత్రాలు వరుసకట్టి చూస్తే అష్టాదశ పర్వాల భారతం బుర్రలో స్థిరంగా నిలిచిపోతుంది. ఇక రామాయణ కావ్యం ఆధారంగా పదుల సంఖ్యలో పౌరాణిక చిత్రాలు తెలుగు తెరను పునీతం చేశాయి.

❖ ❖ ❖

హిరణ్యకశిపుడు, నరసింహస్వామి కథ ఎప్పుడో సత్యయుగం నాటి సంఘటన. మనకు పురాణగాథ. రామరావణుల యుద్ధం త్రేతాయుగం నాటి ముచ్చట.
కృష్ణ లీలలు ద్వాపర యుగం సంబురం. ఇవన్నీ మనకు పురాణ వాఙ్మయం రూపంలో అందుబాటులో ఉండొచ్చు! కానీ, సినిమాలుగా ప్రదర్శితమయ్యాక.. పురాణేతిహాసాల్లో ఇంతుందా అనిపించింది. ఇంత పురాణం ఇప్పుడు చెప్పడం ఎందుకంటే.. కారణం 'కల్కి 2898 ఏడీ' సినిమా వస్తుండటమే! పురాణాలకూ, ఆ సినిమా కథకూ ప్రత్యక్ష సంబంధం ఉందని ఈ చిత్రాన్ని ప్రకటించినప్పుడే తెలిసిపోయింది. టీజర్ వచ్చాక ఆ అభిప్రాయం మరింత బలపడింది. ట్రైలర్ చూశాక.. ఉన్న కాస్త అనుమానమూ పటాపంచలైంది.
నాగ్ అశ్విన్ అల్లుకున్న కథంతా పురాణోక్తమే! ద్వాపర యుగంలో కథ మొదలవుతుందనీ ఆయనే చెప్పాడు. కలియుగాంతం ఎలా ఉంటుందో చెబుతానంటున్నాడు. శ్రీమహావిష్ణువు దశావతారమైన 'కల్కి' కథానాయకుడు. సప్తచిరంజీవుల్లో ఒకడైన పురాణ పురుషుడు అశ్వత్థామ పాత్ర ఉండనే ఉంది. మోక్షనగరి కాశికాపురి కథా వేదికగా కనిపిస్తున్నది. యోగులు, దేవతలూ సంచరిస్తారని చెప్పే 'శంబల' నగరి ప్రస్తావనా ఉంది. మన్వంతరంలో మొదటిదైన సత్యయుగంలోనే హిరణ్యకశిపుడి లాంటి తపశ్శక్తి సంపన్నుడైన రాక్షసుడు ఉంటే... కలియుగాంతంలో తారసపడే రాక్షసుడు ఇంకెంత బలంగా ఉంటాడో ఊహించుకొని ప్రతినాయకుడు 'కలి' పాత్ర సృష్టించానని దర్శకుడే స్వయంగా ప్రకటించాడు. అంటే.. ఈ 'కలి' కూడా మాంచి ఆకలి మీదున్న పురాణ పాత్రేనని అర్థం చేసుకోకుండా ఎలా ఉండగలం?

❖ ❖ ❖

టేకింగ్‌లో తేడా ఉండొచ్చు.
వేషభాషల్లో ఆధునికత కనిపించొచ్చు.
నాటి మేటి పౌరాణిక చిత్రాల మాదిరి సంస్కృత సమాస భూయిష్టమైన భారీ డైలాగులు ఉండకపోవచ్చు.
పోరాటాల్లో పద్మవ్యూహాలు లేకపోవచ్చు.
అస్త్రశస్త్రాలు రూపు మారి ఉండొచ్చు.
ఈ చిత్ర కథానాయకుడు ప్రభాస్ వేసుకున్న రోబోటిక్ సూట్.. ద్వాపరంలో కర్ణుడి సహజ కవచాన్ని గుర్తు చేస్తున్నది. పోరాట సన్నివేశాల్లో పేలుతున్న అస్త్రాలు.. 'మాయాబజార్'లో హిడింబి ఆవాసానికి వస్తున్న అభిమన్యుడిపై ఘటోత్కచుడు సంధించిన శస్త్రాలను మరిపిస్తున్నాయి. నిత్యనైమిత్తిక కర్మల్లో చెబుతున్న సంకల్పం ఆధారంగా.. ఇప్పటికింకా మనం కలియుగం ప్రథమ పాదంలోనే ఉన్నాం. ఇప్పుడే ఏఐ టెక్నాలజీ ఇంతగా తిమ్మిని బమ్మి చేస్తుంటే.. చతుర్థ పాదంలో సాంకేతికత మరెంత విశృంఖల మాయ చేస్తుందో మామూలు మస్తిష్కంతో అంచనా వేయలేం. మన పురాణాల్లో వాటికీ లెక్కుంది. కలియుగాంతానికి మానవ జీవన ప్రమాణాలు ఎలా దిగజారుతాయో, ఆయుర్దాయం ఎంతగా పతనమవుతుందో, జలవనరులు ఎలా అధఃపాతాళానికి పడిపోతాయో రుషులు దర్శించి వివరించారు. ఆ సంగతులన్నీ పరిశీలించి, పరిశోధనలు చేసి, పరితపించి కథగా రాసుకున్నాడు దర్శకుడు నాగ్ అశ్విన్. ఐదేండ్ల తపస్సు చేస్తే ఈ కథకు ఓ రూపం వచ్చిందని ఆయన చెప్పుకొచ్చాడు. ఆరువేల ఏండ్ల చరిత్ర చెప్పాలంటే ఐదేండ్లు ఖర్చు చేయాల్సిందే కదా!

> 'కల్కి..' హాలీవుడ్ రేంజ్‌ను మించేలా చిత్రాన్ని నిర్మించినట్టు తెలుస్తూనే ఉంది. ఇన్ని కారణాలు ఏకరువు పెట్టినా.. ఇది పౌరాణికం అంటే డిజిటల్ లోకంలో విహరిస్తున్న ప్రేక్షకులు ఒప్పుకోకపోవచ్చు. కానీ, ఈ కలియుగం అంతం కావడంతో ఓ మహాయుగం పూర్తవుతుంది. మళ్లీ సత్యయుగం మొదలవుతుంది. మహాప్రళయ సమయంలో విష్ణుమూర్తి.. వేదాలను కాపాడి వైవస్వత మనువుకు ఇచ్చి పదిలమని చెప్పాడు. అలా అందిన వేదాలు సత్య, త్రేత, ద్వాపర యుగాలను దాటి.. కలియుగానికీ అందాయి. ఇప్పుడు అంతా క్లౌడ్ హవా. డిజిటల్ రూపంలో క్లౌడ్‌లోకి వెళ్లిపోయే 'కల్కి 2898 ఏడీ' కలియుగాంతం తర్వాత వచ్చే సత్యయుగం ప్రజలకు అందుబాటులోనే ఉంటుంది. అప్పటి జనాలు ఈ చిత్రాన్ని చూసి 'పౌరాణిక చిత్రం'గా గుర్తించకుండా ఉండలేరు!

...✍ రామకీర్తన